# వాయిదాపడిన కోపం

(కథానిక)

ఇంట్లోవాళ్లమీద కోపం వచ్చింది 'సాత్యకి'కి.

ఇట్లా అనేక పర్యాయాలు వచ్చింది. ఇదేం కొత్తగాదు. అయితే యీసారి వచ్చిన కోపం పెద్దసైజు. ఇంట్లోవాళ్ళంటే మాత్రం ఎవరు? తన తండ్రి, తల్లి, ఇద్దరు అన్నలూనూ. వీళ్ళు చాలరూ, తనకు ప్రతిపనికీ అడ్డం కొట్టటానికి? ఈ కోపానికి కారణం దారుణంగా వున్నది. సాత్యకి బళ్ళో పిల్లలతో విచ్చలవిడిగా తిరుగాడుతాడు. కలుపుగోలుతనంగా వుంటాడు. వాళ్ళంతా ఒకే జాతికి చెందినవాళ్లు. తన యింట్లోవాళ్ళ దృష్టిలో తన స్నేహితులంతా కేవలం తన్ను పాడుచెయ్యటానికే పుట్టిన పరమ దుర్మార్గులుగా భావింపబడటం సాత్యకికి ఎన్నో వేదన కలిగించక మానలేదు. ఎన్ననుకుంటేనేం. చేదామనుకునేసరికి తన చేతిలో ఒక్క సాధనమూ లేకపోయెను! వాడికి వెక్కి వెక్కి ఏడిచేందుకయినా వోపిక లేకపోయింది!

ఇంట్లోవాళ్లు - ముఖ్యంగా తల్లి - తనని ఒక్కపని స్వంతంగా చెయ్యనీయరు. ప్రతిదీ ఆవిడకు చెప్పిగాని చేయరాదు. చివరకు నచ్చిన చొక్కా తొడుక్కొనుకూడా లేదు. 'నా నల్లగీరల చొక్కా యివాళ తొడుక్కుపోతాను' అంటే- 'వొద్దు, యివాళ తెల్ల చొక్కా వేసుకుపో. నల్లగీరల చొక్కా అప్పుడే మాపటం ఎందుకు?' అంటుంది. ఒక్క విషయమా ఒక్క లోకమా? ప్రతిదీ యింతే.

'ఈ సాయంత్రం నీతోపాటు షికారుకు తీసుకువెళ్లు నాకూ నదివొడ్డున కూచోవాలని వుంది" అంటే- తన అన్న, స్వంత సొమ్మంతా ఖర్చయిపోతున్నట్లు-'నువ్వా షికారుకెందుకు? ఇంట్లోనేవుండు. ఎప్పుడో చీకటి పడితేగాని రాను నేను' అంటాడు. ఏం, ఎంతరాత్రయితే మాత్రం, అన్న దగ్గరుండగా తనకేం భయం గనక? తను కూడావస్తే వాడి రాచకార్యాలు- అవీ ఏవున్నాయి గనక చెడిపోవడానికి? తల్లి యేమంటుంది? 'ఇప్పటినించే షికార్లు మరిగి-' షికారు వెళ్ళటమూ ఒక తప్పే అయితే, తన యిద్దరన్నలూ కళ్ళారా పాడైపోతూంటే, మాస్తోవూరుకుందే! తల్లి? కేవలం తనని మభ్యపరచటానికని అసత్యాన్ని, సత్యంగా ప్రచారం చేస్తోందని వాడిఅంతరాత్మ ఘాటుగా చెప్పింది. వాడిది నమ్మి వూరుకున్నాడు.

"అంత విలువగల బట్ట నీకెందుకు?"

అర్థంవుందా ఆమాటకు? విలువగల బట్ట కట్టేందుకు తన అన్నలూనూ, ఎందుకూ పనికిరాని పేలికలు తనకూనా? ఎందుకంత ద్వేషం వాళ్ళకి తనంటే?

వయసునిబట్టి యింత 'చిన్న'గా తననెందుకు వ్యవహరించాలో వాడి బుర్రకు అర్థం కాలేదు. అది కేవలం యింట్లోవాళ్ళ రాక్షసత్వమే. ఇంట్లో అందరికన్నా తనే చిన్న నిజానికి. అయినంత మాత్రాన తనకు సుఖసంపదలూ, భోగభాగ్యాలూ లేకుండా పోవాలనెక్కడ వుంది? అమాంతంగా తను పెద్దవాడై, వేళ్ళకి మూడు వుంగరాలు పెట్టుకుని, తన అన్నల్నీ, అందర్నీ మొట్టితే బాగుండును. కాని ఆ ఆలోచనకన్నా అవివేకం మరోటి లేదని వాడికి చప్పున స్ఫురించింది. తను పెద్దవాడు అవుతూన్నంతసేపూ వీళ్లు ఊరికే వుంటారా? వాళ్ళకీ తనకీ వున్న వయోభేదం యెప్పుడూ నికరంగానే వుంటుంది. మారటానికి వీలేదీ?"

తన చదువు తను చదువుతుండేను, మరొకరి ప్రమేయం లేకుండా. ప్రతివాడూ తన చదువులో జోక్యం కలిగించుకొని, కొంత పాడుచెయ్యటమేగాని, మరేమైనా వున్నదీ? తల్లి తనని యేక్షణానా ఆడుకోనివ్వదు. బడి విడిచిపెట్టగానే, సూటిగా యింటికి వచ్చేసి కూర్చోమంటుంది దార్లో మైదానాన్ని వొదిలేసి. ఆటలు మరగటంవల్ల మతి క్రమంగా చదువు

"శ్రీ విరించి"

మీదినించి వైదొలగిపోయి పిల్లలు యెందుకూ పనికిరారని ఆవిడ గట్టిగా నమ్మింది. ఆమెకు ఆ నమ్మకం కుదిరింతర్వాత, సాత్యకి యెట్లా ఆదుకోవటం తటస్థిస్తుంది?

తను ఎవరికోసం బతుకుతున్నట్టు? తను బతుకుతున్నందుకు, తనకే ఆనందం లేకపోయిన తర్వాత ఏమనుకుంటే యేం లాభం? తనకి యెందులోనూ స్వేచ్ఛ లేదు. విరివిగా సినిమాలు చూచేందుకు లేదుగదా! పోనీ ఊరి మధ్య ఆడుతున్న వీధి భాగవతం యేమీ డబ్బు ఖర్చు లేకుండా చూచేందుకు లేదు. తన చేతికి ఒక్క దమ్మిడీ గూడా రాదు. తనకు యేం కావలసినా తల్లినే అడగాలి. ఆ అడిగిన సమయంలో ఆవిడ యే విసుగులోనో, కోపంలోనో వుంటే తనకి చీవాట్లూ, దెబ్బలూ తప్పవు. అడగటం ఏదైనా కావలసివస్తే గదా. ఈ కావలసిరావటం అనేది యేదేనా సమయం కనిపెట్టి వస్తుందా? తనకు అవసరమయినప్పుడు పొందలేనివస్తువు ఎప్పుడో దానంతట అదే దొరికినా, అందులో యేం సంతోషం వున్నది?

అన్ని విషయాలూ వదిలేతాం. చివరకు తిండి విషయాన మాత్రం? సరిగ్గా ఆ టైముకే గాని, ఒక అర నిముషం ఆటయినా, యిటయినా అన్నం పెట్టదు తల్లి; అందరికి మల్లే, బజారులో అమ్మే చిరుతిండులు కొనుక్కోనీదు. వాటిని రోజూ చూస్తున్నకొద్దీ తినాలనే ఆశ, కోరిక హెచ్చిపోతున్నాయి. కాని ఎట్లా? తల్లి అవి తింటె జబ్బులువచ్చి చస్తారని అంటుంది. అదెంతమాత్రం నిజం కాదని సాత్యకి వూహించుకున్నాడు. నిజమే అయితే, తన జల్లోనాళ్ళంతా చావరేం? వాళ్లు కొనుక్కు తినని వూళ్ళే వుండదే?

కోపం ఐతే వచ్చింది. చాలా ఘనంగానే వచ్చింది. కాని యేంచెయ్యాలి యీ కోపం వచ్చినందుకు? కోపం అంటే పగే గదా. యీ పగ తీర్చుకోవాలి, కసి తీర్చుకోవాలి. యెవరి మీద? కోపం యెవరిమీద వచ్చిందో వారి మీద ...?

తన తల్లి యేంచేస్తుంది కోపంవస్తే? నాన్న యేంచేస్తాడు? అన్నలు? వాళ్ళంతా యెవరినో కోప్పడతారు, తిడతారు. తను ఎవర్ని కోప్పడగలడు? ఎవరిని తిట్టగలడు? ఎవరూరుకుంటారు తను కొడితే తిడితే? లాభం లేదు. తన తల్లిదండ్రులనించి తను యేమీ నేర్చుకోలేదు. స్వబుద్ధి కేమీ తోచదు. తను బడి పంతులన్నా కొకపోయెను కొట్టాటనికి. ఈ నిమిషంలో సాత్యకికి తనకు నిజంగా ఏ విషయంలోనూ ప్రత్యేకత లేదేమో ననిపించింది. కోపం తీర్చుకోటానికి యేమీ సాధనాలు లేని తనకి, మరే ముందని చెప్పుకోవాలి?

ఆలోచించగా అతనికి తనలో యే ప్రత్యేకతా లేదని తేలిపోయింది. లేకపోగా సామాన్యమైన పిల్లల లక్షణాలూ లేవని తోచింది. అందరు పిల్లలూ యిదే రీతిగా బాధ పడతారా—అనటానికేమీ ఆధారం కనిపించడం లేదు తనకి. వాళ్ళకే చీకూచింతా వున్నట్లు కనిపించదు. ఇంకా లోతుకుపోతే అతనికి బిచ్చమెత్తుకునే కుర్రాళ్లు నయమనిపించింది. తనకు లేనిదాన్ని, లేదని చెప్పటానికి తనకు నోరురాదు. తనకా సాహసం లేదు.

కోపం తీవ్రస్వరాన పడింది. ఇక తల్లిదండ్రుల ముఖం చూడగూడదు. ఎదురయినా కళ్లు మూసుకోవాలి. వాళ్ళతో మాటాడ కూడదు. దానికి మార్గం?

సాత్యకి లేచిపోదా మనుకున్నాడు. ఎక్కడికి? అన్నం యెవరు పెడతారు? బట్ట లెవరు కుట్టిస్తారు? ఎక్కడ పడుకోవాలి? బడిజీతం మాటేమిటి? పుస్తకాల డబ్బు... యింకా, యింకా...! అన్నీ ఖర్చుల జాబితాయే గాని, రాబడి మచ్చుకైనా ఒకటి లేదే!

తనకో చిన్న బంగళా వుండి, కావల్సినంత డబ్బువుంటే యెంత బాగుండిపోవును. ఇంకోళ్ల ఊసు లేకండా దాన్లో హాయిగా వుండొచ్చును. ఈ వూహతో సాత్యకికి ఒక సందేహం తీరినట్లయింది. ఒక చిన్న బంగళా కావల్సినంత డబ్బూ తను సంపాయించేటంతవరకూ తను కోపపడి లాభం లేదని గ్రహించాడు. ఎంత కోపంవచ్చినా, అప్పటివరకూ ఆపుకుని, అవి సంపాయించిన మరుక్షణంలో లేచిపోదామని నిశ్చయించుకున్నాడు.